సాక్షి ప్రకాశం

శుక్రవారం । 2 । జూన్ । 2023



ఆస్తి కోసమే వృద్ధుడి కిడ్నాప్

వృద్ధుడు పెద్దిరెడ్డి రామిరెడ్డి కిడ్నాప్ కేసును పోలీసులు ఛేదించారు. ఆస్తి కోసం అతని భార్య అక్క కుమారులే కిడ్నాప్ చేసినట్లు ఎస్పీ మలికాగర్గ్ తెలిపారు. - 8లో..



తలుపులు బద్దలు కొట్టి..

సింగరాయకొండ మండలం మూలగుంటపాడు పంచాయతీ విద్యానగర్‌లో గురువారం భారీ చోరీ జరిగింది. - 8లో..

గరిష్టం/కనిష్టం
42 /30

వాతావరణం

ఆకాశం అక్కడక్కడా మేఘావృతమై ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు అధికం.




సీఎం వైఎస్ జగన్‌తో ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

సీఎంను కలిసిన ఎమ్మెల్యే బాలినేని

ఒంగోలు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో గురువారం ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి కలిశారు. సుమారు 45 నిముషాల పాటు పలు విషయాలపై చర్చించారు. జిల్లాలోని రాజకీయ పరిస్థితులను సీఎం దృష్టికి బాలినేని తీసుకెళ్లారు. జిల్లాలో పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని బాలినేనికి సీఎం సూచించారు.

అంతర్జాతీయ మార్కెట్లో తిరిగి పూర్వవైభవాన్ని సంతరించుకునేలా టైగర్ రొయ్య మళ్లీ వస్తోందని రైతులు, వ్యాపారులు సంబరపడ్డారు. సరికొత్త బ్రూడర్‌తో వైరస్ సోకని విధంగా వస్తోందని, ఇక తిరుగులేదనుకుని ఆశపడ్డారు. కానీ, అనుకున్నంతగా సీడ్ ఉత్పత్తి కాకపోవడంతో వారి ఆశలు అడియాసలయ్యాయి. సంవత్సర కాలంగా అదే పరిస్థితి కొనసాగుతుండటంతో రైతులకు అందని ద్రాక్షలా సీడ్ తయారైంది. చెన్నైలోని కోస్టల్ ఆక్వా అథారిటీ అధికారులు కూడా దీనిపై ప్రత్యేక దృష్టి సారించకపోవడంతో రైతులకు కావాల్సినన్ని టైగర్ రొయ్య పిల్లలు దొరకడం లేదు.

టైగర్ పట్టి..!



- కొత్త టైగర్ రకం సీడ్ వచ్చిందని ఆశపడిన ఆక్వా రైతులు
- సీడ్ సక్రమంగా సరఫరా కాకపోవడంతో నిరాశ
- దక్షిణ భారత దేశంలో ఐదు హేచరీల్లో మాత్రమే సీడ్ ఉత్పత్తి
- నెల్లూరు, తమిళనాడు హేచరీలే దిక్కు
- నకిలీ సీడ్ నివారణకు నిఘా
- సీడ్ దొరక్క వంద ఎకరాల్లోనే సాగు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

ఆక్వా రంగంలో టైగర్ రొయ్య రారాజుగా వెలుగొందింది. అంతర్జాతీయ మార్కెట్లో డాలర్ల వర్షాన్ని కురిపించింది. వివిధ రకాల వైరస్‌లు సోకడంతో రైతులు తీవ్రంగా నష్టపోగా, నాలుగు దశాబ్దాల కిందట ఇది కనుమరుగైంది. ఆ తర్వాత ఇప్పటి వరకు వెనామీ రొయ్యలు రాజ్యమేలుతూ వచ్చాయి. ఎన్నో అధునాతన ప్రయోగాలు, పరిశోధనలతో వైరస్‌కు ఎలాంటి తావులేకుండా ఉండే సరికొత్త టైగర్ బ్రూడర్స్‌ను విదేశాల నుంచి దిగుమతి చేసుకున్నారు. వాటి ద్వారా సీడ్ ఉత్పత్తి చేసి ఆక్వా సాగు చేసే రైతులకు అందించాలనుకున్నారు. టైగర్ రొయ్య తిరిగి పూర్వ వైభవాన్ని సంతరించుకోనుందని అందరూ ఆశగా ఎదురుచూశారు. అయితే, రైతులకు సరిపడా సీడ్ ఉత్పత్తి చేయలేకపోవడంతో నిరాశ తప్పలేదు.



దక్షిణ భారతదేశంలో ఐదు హేచరీలకు అనుమతి...

టైగర్ రొయ్యల సీడ్ ఉత్పత్తికి దక్షిణ భారతదేశంలో ఐదు హేచరీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుమతులిచ్చాయి. సరికొత్త బ్రూడర్‌తో సీడ్ ఉత్పత్తి చేసేందుకు తమిళనాడులోని చెంగల్‌పట్టులో రెండు, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలో మూడు హేచరీలకు అనుమతిచ్చారు. వీటితో పాటు గుజరాత్‌లో మరో రెండు హేచరీలకు టైగర్ రొయ్య పిల్లలను ఉత్పత్తి చేయడానికి అనుమతిచ్చారు. ఈ హేచరీలలో సరికొత్త బ్రూడర్లను విదేశాల నుంచి దిగుమతి చేసుకుని సీడు ఉత్పత్తి చేస్తున్నారు. అమెరికా నుంచి సరికొత్త బ్రూడర్స్‌ను దిగుమతి చేసుకుని కొన్ని రోజుల పాటు క్వారంటైన్‌లో ఉంచి అనేక పరీక్షల తర్వాత సీడ్ ఉత్పత్తికి అనుకూలంగా ఉంటేనే వాటిని వినియోగిస్తున్నారు. ప్రస్తుతం ఈ సీడ్‌కు సంబంధించి జిల్లాలో ఒక్క హేచరీ కూడా లేకపోవడంతో రైతులు తమిళనాడు, నెల్లూరు జిల్లాల్లో అనుమతి పొందిన ఐదు హేచరీలపైనే ఆధారపడాల్సి వస్తోంది. ఫలితంగా సీడ్ దొరక్క నిరాశ చెందాల్సి వస్తోంది.

హేచరీలపై కన్ను...

టైగర్ రొయ్యల సాగు తిరిగి ప్రారంభం కానుండటంతో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. నకిలీ సీడ్ బారిన పడకుండా ఆక్వా రైతులను కాపాడటానికి మత్స్యశాఖ తనిఖీలను ముమ్మరం చేసింది. టైగర్ సీడ్ ముసుగులో వెనామీ రొయ్య పిల్లలను రైతులకు అంటగట్టకుండా హేచరీలపై ప్రత్యేక నిఘా ఉంచింది. నాసిరకం టైగర్ రొయ్యల సీడు ఉత్పత్తి కాకుండా కూడా ప్రభుత్వం ప్రత్యేకంగా అధికారులతో కూడిన బృందాలను ఏర్పాటు చేసింది. అందు కోసం జిల్లాలోని 41 హేచరీలపై కోస్టల్ ఆక్వా కల్చర్ అథారిటీ (సీఏఏ), జిల్లా మత్స్య శాఖ అధికారులు సంయుక్తంగా పలు దఫాలుగా దాడులు నిర్వహించారు. ఈతముక్కల గ్రామంలో ఒక హేచరీ నుంచి నకిలీ టైగర్ సీడ్ బయటకు వచ్చిందని సమాచారం అందడంతో ఆ హేచరీని గతంలో అధికారులు మూసివేశారు. టైగర్ సీడ్ పేరుతో ఆక్వా రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హేచరీల నిర్వాహకులకు ఇప్పటికే హెచ్చరికలు జారీ చేశారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం ఆధీనంలోని కోస్టల్ ఆక్వా కల్చర్ అథారిటీ ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

జిల్లాలో 100 ఎకరాల్లో మాత్రమే టైగర్ సాగు...

జిల్లాలో కేవలం 100 ఎకరాల్లో మాత్రమే టైగర్ రొయ్య సాగు చేస్తున్నారు. అందుకు కారణం సకాలంలో టైగర్ రొయ్య పిల్లలు సరఫరా కాకపోవడమే. జిల్లాలో మొత్తం 15 వేల ఎకరాలకుపైగా ఆక్వా సాగవుతోంది. సాధారణంగా ప్రతి సంవత్సరం రెండు సీజన్లలో రొయ్యల సాగు చేపడతారు. జనవరి నుంచి మే నెల వరకు ఒకటి కాగా, రెండోది జూన్ నుంచి మొదలుపెడతారు. కొంత మంది వీలును బట్టి మూడో దఫా కూడా రొయ్యల సాగు చేపడతారు. టైగర్ రొయ్యల సీడ్ అందుబాటులో ఉంటే జిల్లాలోని మొత్తం విస్తీర్ణంలో కూడా టైగర్ రొయ్యల సాగు చేయడానికి ఏ ఒక్కరూ వెనకాడరంటే.. టైగర్ సాగు వల్ల లాభాలు ఏ స్థాయిలో ఉంటాయో అర్థం చేసుకోవచ్చు.

స్టేక్ హోల్డర్స్‌కు అవగాహన...

ఆక్వాకల్చర్ భాగస్వాముల సమావేశాలు (స్టేక్ హోల్డర్స్ మీటింగ్స్) ఏర్పాటు చేసి మత్స్యశాఖ అధికారులు అవగాహన కూడా కల్పించారు. ఆక్వా రైతులకు ఎలాంటి నష్టం సంభవించకుండా ఉండటానికి రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా చట్టం కూడా చేసింది. అందుకోసమే ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఆక్వాకల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఏపీఎస్ఏడీఏ) యాక్ట్ తీసుకొచ్చింది. ఆక్వాకల్చర్ భాగస్వాముల కిందకు ఆక్వా రైతులతో పాటు ఆక్వా ఫీడు, సీడ్ ఉత్పత్తిదారులు, హేచరీల యజమానులు, ట్రేడర్స్, ఎక్స్‌పోర్టర్లు, ప్రాసెసింగ్ ప్లాంట్ల యజమానులు వస్తారు. ప్రతిఒక్కరూ ప్రభుత్వ నిర్ణయాల ప్రకారం నడుచుకోవాల్సి ఉంటుంది. ఇప్పటికే జిల్లా కేంద్రమైన ఒంగోలులో స్టేక్ హోల్డర్స్ సమావేశం నిర్వహించి నకిలీ టైగర్ రొయ్య సీడ్‌తో పాటు ఆక్వాకు సంబంధించిన అన్ని అంశాలపై లోతుగా అధికారులు అవగాహన కల్పించారు.



హేచరీలపై ప్రత్యేక నిఘా...

జిల్లాలో ఉన్న 41 హేచరీలపై ప్రత్యేక నిఘా ఉంటుంది. కోస్టల్ ఆక్వా కల్చర్ అథారిటీ (సీఏఏ) అధికారులు ఎప్పటికప్పుడు జిల్లా మత్స్యశాఖ అధికారుల సమన్వయంతో ముందుకు సాగుతున్నారు. ఎప్పటికప్పుడు సీఏఏ అధికారులకు సమాచారం అందిస్తున్నాం. అనుమతి ఉన్న హేచరీల నుంచి తీసుకొచ్చిన టైగర్ సీడ్‌ను నేరుగా సాగుచేస్తున్న చెరువుల్లోనే వేయాలి. హేచరీలకు తీసుకెళ్లకూడదు. అలా ఎవరైనా టైగర్ రొయ్య సీడ్‌ను తీసుకొచ్చి హేచరీల్లోని వెనామీ సీడ్‌తో కలిపి నకిలీగా సృష్టిస్తే క్రిమినల్ చర్యలకు కూడా వెనకాడం. టైగర్ సీడ్ నకిలీ అన్న మాట ఏ ఒక్క ఆక్వా రైతు నోటి నుంచి రాకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

– ఆవుల చంద్రశేఖరరెడ్డి, జాయింట్ డైరెక్టర్, జిల్లా మత్స్యశాఖ

న్యూస్‌రీల్

4న అష్టాదశోత్తర శతకం గ్రంథావిష్కరణ

ఒంగోలు టౌన్: సింగరాయకొండలోని సాయి మందిరంలో ఈ నెల 4వ తేదీ మార్తాటి ఈశ్వర గోపాలరావు రచించిన వేణుదత్తస్త వము అష్టాదశోత్తర శతకము గ్రంథాన్ని ఆవిష్కరించనున్నట్లు గురువారం ఒక ప్రకటనలో రచయిత తెలిపారు. ఈ గ్రంథాన్ని నవ్యాంధ్ర రచయిత్రుల సంఘ రాష్ట్ర అధ్యక్షురాలు తేళ్ల అరుణ, శ్రీకృష్ణ దేవరాయ సాహితీ సంస్థ అధ్యక్షుడు కుర్రా ప్రసాద్‌బాబు ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. తెలుగు లోగిలి జాతీయ అధ్యక్షుడు డాక్టర్ నూనె అంకమరావు, ప్రకాశం జిల్లా రచయితల సంఘ అధ్యక్షుడు పొన్నూరు శ్రీనివాసులు, ద్విభాషా పండితుడు గుడ్లూరి వెంకటేశ్వరరావు ముఖ్య అతిథులుగా హాజరుకానున్న ఈ సభను జయప్రదం చేయాలని ఆయన కోరారు.

మలేరియా నివారణ మాసోత్సవాలు ప్రారంభం

ఒంగోలు అర్బన్: జూన్ నెలలో నిర్వహించే మలేరియా నివారణ మాసోత్సవాలను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వ నర్సింగ్ కాలేజీలో నిర్వహించిన కార్యక్రమంలో క్షయ నివారణ జిల్లా అధికారి డాక్టర్ సురేష్‌కుమార్ పాల్గొని మాట్లాడారు. దోమలు ప్రబలి కీటక జనిత వ్యాధులైన మలేరియా, ఫైలేరియా, డెంగీ, చికున్‌గున్యా వంటివి ప్రబలే అవకాశం ఉన్నందున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దోమలు వృద్ధి చెందకుండా గృహస్తులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నీటిని ఎక్కువ రోజులు నిల్వ చేయరాదన్నారు. వాడేసిన కొబ్బరిబోండాలను దూరంగా పారేయాలని, ఇంటి పరిసరాల్లో మురుగు, చెత్త నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. జ్వరం వస్తే వెంటనే ఆశ, ఆరోగ్య కార్యకర్తలను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో మలేరియా అధికారి జ్ఞానశ్రీ, నర్సింగ్ కాలేజి ప్రిన్సిపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు: జిల్లాలోని హైస్కూల్ ప్లస్ పాఠశాలల్లో ఆంగ్లం, కెమిస్ట్రీ, జువాలజీ, కామర్స్ సబ్జెక్టులు బోధించేందుకు ఆసక్తి గల స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈవో పి.రమేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శీలంవారిపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో ఆంగ్లం, మైనంపాడు జీహెచ్ఎస్, శీలంవారిపల్లి, గిద్దలూరు జెడ్పీహెచ్ఎస్‌లలో కెమిస్ట్రీ, తిమ్మాయపాలెం, శీలంవారిపల్లి, దేవరపాలెం, ఇంకొల్లు, బూదవాడ, ఉప్పలపాడు జెడ్పీహెచ్ఎస్‌లలో జువాలజీ, వలపర్ల, పాకల జెడ్పీహెచ్ఎస్‌లలో కామర్స్ సబ్జెక్టులు బోధించేందుకు శుక్రవారం సాయంత్రం 5 గంటల్లోపు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈవో పేర్కొన్నారు.

అన్నదాతకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

- చుక్కల భూముల సమస్య పరిష్కారంతో జిల్లాలో 34 వేల ఎకరాలకు విముక్తి
- రైతు భరోసా కార్యక్రమంలో మంత్రి ఆదిమూలపు, ఎమ్మెల్యే బాలినేని
- జిల్లాలో 2,84,113 రైతు కుటుంబాలకు రూ.213.08 కోట్ల ఆర్థిక ప్రయోజనం



రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ చెక్కు అందజేస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, కలెక్టర్ దినేష్‌కుమార్, మేయర్ గంగాడ తదితరులు

ఒంగోలు అర్బన్: అన్నదాతకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తోందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి ఆదిమూలపు సురేష్, ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. వైఎస్సార్ రైతు భరోసా-పీఎం కిసాన్ పథకం అమలులో భాగంగా వరుసగా ఐదోసారి 2023-24 సంవత్సరానికి సంబంధించి మొదటి విడత ఆర్థిక సహాయాన్ని రైతుల ఖాతాల్లో గురువారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జమ చేశారు. ఈ ఏడాది మార్చి, ఏప్రిల్, మే నెలల్లో కురిసిన అకాల వర్షాలకు నష్టపోయిన పంటలకు రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ నిధులు కూడా విడుదల చేశారు. కర్నూలు జిల్లా పత్తికొండలో సీఎం నిర్వహించిన రాష్ట్ర స్థాయి కార్యక్రమానికి అనుబంధంగా జిల్లాలో ఒంగోలులోని పాత జెడ్పీ కార్యాలయ సమావేశపు హాలులో సభ నిర్వహించారు. జిల్లా వ్యవసాయ సలహా మండల కమిటీ చైర్మన్ ఆళ్ల రవీంద్రారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి ఆదిమూలపు, ఎమ్మెల్యే బాలినేనితో పాటు కలెక్టర్ దినేష్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, నగర మేయర్ గంగాడ సుజాత, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మార్కాపురం మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి పాల్గొన్నారు. రైతులకు రైతు భరోసా, ఇన్‌పుట్ సబ్సిడీ చెక్కులు అందజేశారు.

ఈ సందర్భంగా మంత్రి సురేష్ మాట్లాడుతూ వ్యవసాయాభివృద్ధి, రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఎన్నికల హామీ కంటే రూ.1000 అదనంగా రైతు భరోసా పథకం ద్వారా అందిస్తూ ఐదేళ్లుగా అమలు చేయడమే అందుకు నిదర్శనమన్నారు. దుక్కి దున్నకం నుంచి పంట చేతికొచ్చేంత వరకు వివిధ దశల్లో రైతులకు ఉపయోగపడేలా విడతల వారీగా ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం అందజేస్తోందన్నారు. రైతు సుభిక్షంగా ఉండటమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నట్లు తెలిపారు.

ఇది రైతు ప్రభుత్వం : ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ తమది రైతు పక్షపాత ప్రభుత్వమని తెలిపారు. ఎన్నో ఏళ్లుగా ఉన్న చుక్కల భూముల సమస్యను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించిందన్నారు. ఫలితంగా జిల్లాలో సుమారు 34 వేల ఎకరాలకు విముక్తి లభించిందన్నారు. భూ సమస్యలను పరిష్కరించడంతో పాటు వాటిని సస్యశ్యామలం చేసేందుకు వెలిగొండ ప్రాజెక్టుకు నిధుల కోసం జిల్లాలోని ప్రజాప్రతినిధులమంతా కలిసి ముఖ్యమంత్రితో చర్చిస్తామన్నారు. రైతులకు ఏ అవసరం వచ్చినా ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. కలెక్టర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ 2023-24 సంవత్సరానికి రైతు భరోసా కింద జిల్లాలో మొదటి విడతలో ఒక్కో రైతుకు కుటుంబానికి రూ.7,500 చొప్పున 2,84,113 కుటుంబాలకు రూ.213.08 కోట్ల ఆర్థిక ప్రయోజనం కలుగుతుందన్నారు. అందులో భూయజమానుల కోటాలో 2,81,850 మంది రైతు కుటుంబాలకు, ఆర్ఓఎఫ్ఆర్ కోటాలో 2,263 రైతు కుటుంబాలకు లబ్ధిచేకూరుతుందన్నారు. ఈ ఏడాది మార్చిలో కురిసిన అకాల వర్షాలకు జిల్లాలో 196.8 హెక్టార్లలో పంటలు నష్టపోయిన 218 మంది రైతులకు రూ.28.65 లక్షలు, ఏప్రిల్, మే నెలల్లో వర్షాలకు 46.53 హెక్టార్లలో పంటలు నష్టపోయిన 123 మంది రైతులకు రూ.6.12 లక్షల చొప్పున మొత్తం రూ.34.77 లక్షల ఇన్‌పుట్ సబ్సిడీ కూడా నేరుగా రైతుల ఖాతాల్లో ప్రభుత్వం జమచేసినట్లు కలెక్టర్ వివరించారు. అనంతరం రైతులకు త్వరలో సబ్సిడీపై అందించనున్న ట్రాక్టర్లు, ఇతర వ్యవసాయ పనిముట్ల ప్రదర్శనను వీక్షించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాసరావు, పశుసంవర్థక శాఖ జేడీ బేబిరాణి, ఏపీఎంఐపీ పీడీ రవీంద్రబాబు, ఉద్యానవన శాఖాధికారి గోపీచంద్, ఇతర అధికారులు, రైతులు పాల్గొన్నారు.



జెండా ఊపి ఎలక్ట్రికల్ వాహనాల ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఎలక్ట్రికల్ బైకులతో పర్యావరణ పరిరక్షణ

- ఎలక్ట్రికల్ వాహనాల ర్యాలీని ప్రారంభించిన కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: ఎలక్ట్రికల్ బైకుల వినియోగం పెరిగితే వాతావరణంలో కాలుష్యం తగ్గి పర్యావరణ పరిరక్షణతో పాటు తగ్గిపోతున్న ఇంధన వనరులను ఆదా చేయవచ్చని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. నెడ్‌క్యాప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎలక్ట్రికల్ బైకులు, ఆటోల ర్యాలీని గురువారం జెండా ఊపి కలెక్టర్ ప్రారంభించారు. ఎలక్ట్రికల్ బైక్, ఆటోను కలెక్టర్ స్వయంగా నడిపి ఉత్సాహపరిచారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పెట్రోలు, డీజిల్ నిల్వలు రోజురోజుకు తగ్గిపోతున్నందున ఇప్పటికే 90 శాతం ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నామన్నారు. ఈ నేపథ్యంలో ఈ-బైక్‌ల వినియోగం పెరగాలన్నారు. ఈ-బైక్‌ల వల్ల ఆర్థికభారం తగ్గుతుందన్నారు. పర్యావరణం, పెట్రోలు, డీజిల్ నిల్వలు, ఖర్చు తగ్గుదల వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ-బైక్, ఈ-కార్లను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. అన్ని పెట్రోలు బంకుల్లో చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు కానున్నాయన్నారు. కార్యక్రమంలో నెడ్‌క్యాప్ డీజీఎం హరినాథ్‌బాబు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ నాగిరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



ఎలక్ట్రికల్ ఆటో నడుపుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రభుత్వ కార్యాలయాల్లో మౌలిక వసతులు కల్పిస్తాం...

ఒంగోలులోని పాత రిమ్స్‌లో ఉన్న ప్రభుత్వ కార్యాలయాల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తామని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల సముదాయాన్ని గురువారం కలెక్టర్ పరిశీలించారు. మరుగుదొడ్లు, నీటి సౌకర్యం సరిగా లేదని కలెక్టర్ దృష్టికి అధికారులు తీసుకెళ్లారు. స్పందించిన కలెక్టర్.. వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఖాళీ స్థలంతో పాటు వినియోగంలో లేని బ్లాక్‌లకు కూడా మరమ్మతులు చేసి వినియోగించుకునేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. కలెక్టర్ వెంట ఒంగోలు ఆర్డీవో విశ్వేశ్వరరావు, ఇతర అధికారులు ఉన్నారు.

బధిరుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు: స్థానిక భాగ్యనగర్ 4వ లైను 11వ అడ్డరోడ్డులో ఉన్న ప్రభుత్వ బధిరుల పాఠశాలలో 2023-24 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు బధిర విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ టి.వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డీఆర్‌డీఏ వెలుగు కాంప్లెక్స్ వద్ద అత్యంత అధునాతన వసతులతో పాఠశాల భవనాన్ని ప్రభుత్వం ఆధునీకరించిందని చెప్పారు. వినికిడి లోపం ఉన్నట్లు సదరం సర్టిఫికెట్, పాఠశాల బదిలీ సర్టిఫికెట్‌తో పాటు ఆధార్‌కార్డు, బ్యాంకు అకౌంట్ పాస్‌బుక్ మొదటి పేజీ నకలు కాపీతో సంప్రదించాలన్నారు. ఒకటో తరగతి నుంచి 10వ తరగతి వరకు ప్రవేశాలు ప్రారంభమయ్యాయన్నారు. బాలబాలికలకు వేర్వేరుగా ప్రత్యేక హాస్టల్ వసతి ఉందన్నారు. రాష్ట్రంలో ఏ జిల్లాకు చెందిన బధిర విద్యార్థులైనా ప్రవేశం పొందేందుకు అర్హులన్నారు. ఒకటో తరగతిలో చేరేందుకు 6 నుంచి 8 సంవత్సరాల మధ్య వయసు ఉండాలని, బదిలీ సర్టిఫికెట్‌పై అన్ని తరగతులలో ప్రవేశం ఉందని వెల్లడించారు. పూర్తి వివరాలకు 90008 72305, 94419 43071 నంబర్లను సంప్రదించాలని కోరారు.


అంతా చిత్రవిచిత్రం...

- ఉదయం ఎండ తీవ్రత
- మధ్యాహ్నం ఈదురుగాలులు, ఉరుములతో కూడిన భారీ వర్షం
- సాయంత్రం ఉక్కపోత
- గురువారం పలు ప్రాంతాల్లో విచిత్రమైన వాతావరణం

ఒంగోలు అర్బన్: జిల్లాలోని పలు ప్రాంతాల్లో గురువారం విచిత్రమైన వాతావరణం కనిపించింది. జిల్లా కేంద్రంలో మధ్యాహ్నంలోపు అత్యధికంగా 42 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. దీంతో పాటు జిల్లా వ్యాప్తంగా చాలా ప్రాంతాల్లో 40 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అయితే, మధ్యాహ్నానికి వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఉరుములు, ఈదురుగాలులతో భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్ల పక్కన చెట్లు సైతం కూలిపోయాయి. కొంత మేరకు విద్యుత్ అంతరాయం ఏర్పడింది. జిల్లా కేంద్రంలో కలెక్టరేట్‌తో పాటు నగరంలో విద్యుత్ అంతరాయం కలిగింది. వర్షం తగ్గగానే తిరిగి ఎండ త్రీవత చూపడంతో తీవ్రమైన ఉక్కపోతతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. కొంతసేపు ఎండ.. మరికొంతసేపు వర్షం, అనంతరం తీవ్రమైన ఉక్కపోత.. ఇలా విచిత్రంగా వాతావరణ మార్పులు చోటుచేసుకున్నాయి. ఒంగోలు, కొత్తపట్నం, నాగులుప్పలపాడు, టంగుటూరు మండలాలతో పాటు పలు మండలాల్లో ఇదే వాతావరణం నెలకొంది. తీవ్రమైన ఎండల్లో అకస్మాత్తుగా వర్షం కురవడంతో ఉక్కపోతలు పెరిగాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. రానున్న మూడు రోజులు ఎండ తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని, ఉష్ణోగ్రతలు సైతం పెరుగుతాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు.



గాలివానకు కొప్పోలు, ఆలూరు మధ్య విరిగిన చెట్లు



అందాల ఆరెంజ్

టిక్.. టిక్.. టిక్.. టైం దాదాపు సాయంత్రం ఆరు దాటింది. ఈవినింగ్ వాకింగ్‌కు వెళ్లినవారు హడావిడిగా చివరి రౌండ్ పూర్తి చేద్దామనుకున్నారు. ఒక్కసారి పడమర వైపు చూడగానే.. ప్రకృతి వయ్యారంగా పలకరించింది. 'ఎప్పుడూ ఫోన్లలోని ఆర్టిఫీషియల్ రంగులు చూడటమేనా. ఒక్కసారి ఈ కాషాయపు రంగును చూస్తే మీ ఇమ్యూనిటీకి తిరుగుండదు' అని చల్లబడిన సూర్యుడు ఆఫర్ ఇచ్చాడు. తూర్పు వైపు నుంచి తరుముతున్న చీకట్లు వాకర్లను తాకగానే నీడలా మారిపోయి.. ఆరెంజ్ బ్యాక్ గ్రౌండ్‌లో సూపర్ సీనరీగా ఆవిష్కృతమయ్యాయి. ఈ అద్భుత దృశ్యాలు ఒంగోలు నగరంలోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్- 1పై ఉల్లాసాన్ని పంచాయి. – సాక్షి ఒంగోలు



క్లుప్తంగా

పిడుగుపాటుకు కాడెద్లు మృతి



మృతి చెందిన ఎద్లు

బేస్తవారిపేట: పిడుగుపాటుకు కాడెద్లు మృత్యువాత పడిన ఘటన బేస్తవారిపేట మండలంలోని జెన్నివారిపల్లెలో గురువారం చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు.. గ్రామ ఎస్సీ కాలనీకి చెందిన పలుకూరి సీతయ్య తన పొలంలో సేద్యం చేసేందుకు కాడెద్లను తీసుకెళ్లాడు. ఈదురుగాలులతో కూడిన వర్షం పడుతుండటంతో ఎద్లను పొలం గట్టున ఉన్న చెట్టుకు కట్టేశాడు. నాగలి, గొర్రును గట్టుకు తీసుకొచ్చేందుకు మళ్లీ పొలంలోకి వెళ్లాడు. ఈ సమయంలో చెట్టుపై పిడుగు పడటంతో రూ.1.50 లక్షల విలువైన ఎద్లు అక్కడికక్కడే మృతి చెందాయి. అదృష్టవశాత్తు రైతు పొలంలోకి వెళ్లడంతో ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. జీవనాధారమైన కాడెద్లు కళ్ల ముందే మృతి చెందడంతో సీతయ్య బోరున విలపించాడు. ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని రైతు కోరుతున్నాడు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు



ప్రథమ స్థానంలో నిలిచిన వైఎస్సార్ జిల్లా ఎద్లు

కొండాపురం : మండలంలోని గొట్టిగుండాల గ్రామంలో కొలువైన కోట అంకమ్మ తల్లి తిరునాళ్ల సందర్భంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు గురువారం హోరాహోరీగా జరిగాయి. ఇందులో నిర్దేశించిన 20 నిమిషాల్లో 2,200 కేజీల బండను 2,112 అడుగులు లాగి వైఎస్సార్ జిల్లా, కాశీనాయన మండలం, అన్నంవారిపల్లి గ్రామానికి చెందిన శీలం మల్లికార్జునకు చెందిన ఎద్లు ప్రథమ స్థానంలో నిలిచి రూ.60 వేలు గెలుపొందాయి. అలాగే ప్రకాశం జిల్లా బేస్తవరపుపేట మండలం, జేసీ అగ్రహారం గ్రామానికి చెందిన లక్కి శివనాగేశ్వరరావుకు చెందిన ఎద్లు 2,100 అడుగుల వరకు బండను లాగి ద్వితీయ స్థానాన్ని సాధించి రూ.40 వేలు గెలుపొందాయి. అలాగే ప్రకాశం జిల్లా టుంగుటూరుకు చెందిన మక్కెన కోటేశ్వరరావుకు చెందిన ఎద్లు తృతీయ స్థానాన్ని సాధించి రూ.20 వేలు గెలుపొందాయి. ఈ పోటీల్లో నాలుగు జతల ఒంగోలు జాతి ఎద్లు పాల్గొన్నాయి. విజేతలకు ఆలయ పెద్దకాపు శీలం మల్లికార్జున, ఎంపీటీసీ సభ్యుడు మల్లికార్జున, నిర్వాహకులు బహుమతులను అందజేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్సై ఖాజావలీ, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

ఆస్తి కోసమే వృద్ధుడి కిడ్నాప్

- విషయం తెలిసిన 11 గంటల్లోనే పెద్దిరెడ్డి రామిరెడ్డిని రక్షించిన పోలీసులు
- ప్రధాన నిందితులు వృద్ధుడి భార్య తరఫు బంధువులు
- నంద్యాలలో గదిలో బంధించి చిత్రహింసలు పెట్టిన వైనం
- కేసును ఛేదించిన పోలీసులను అభినందించిన ఎస్పీ మలికా గర్గ్
- దర్శి పోలీస్‌స్టేషన్‌లో వివరాల వెల్లడి



విలేకర్ల సమావేశంలో కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ మలికాగర్గ్



తీవ్రంగా గాయపడి నంద్యాలలో చికిత్స పొందుతున్న రామిరెడ్డి

దర్శి/బేస్తవారిపేట: వృద్ధుడి కిడ్నాప్ కథ సుఖాంతమైంది. ఆస్తి, డబ్బు కోసం ఆయన భార్య అక్క కుమారులే ఈ అఘాయిత్యానికి ఒడిగట్టారు. సమాచారం అందిన 11 గంటల్లోనే మార్కాపురం డీఎస్పీ వీరరాఘవరెడ్డి, కంభం సీఐ రాజేష్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది కిడ్నాప్ కేసును ఛేదించారు. వేగంగా స్పందించి సాంకేతిక సాయంతో కేసును ఛేదించిన పోలీసులను ఎస్పీ మలికా గర్గ్ ప్రత్యేకంగా అభినందించారు. గురువారం దర్శి పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో కిడ్నాప్ కేసు పూర్తి వివరాలను ఎస్పీ వెల్లడించారు.

☛ నంద్యాల జిల్లా సంజామల మండలం ముక్కమల్ల గ్రామానికి చెందిన పెద్దిరెడ్డి రామిరెడ్డి గత కొన్నేళ్లుగా బేస్తవారిపేట మండలం పూసలపాడు గ్రామంలో నివాసం ఉంటున్నారు. వృద్ధాప్య పింఛను కోసం పూసలపాడు వచ్చిన రామిరెడ్డి బ్రహ్మంగారి గుడి వద్ద ఉన్నారు. అదే సమయంలో అక్కడికి ఓ కారు వచ్చి ఆగింది. పొలం ఎక్కువ ధరకు కొనుగోలు చేసేవారు నంద్యాలలో ఉన్నారని చెప్పి ముగ్గురు యువకులు బలవంతంగా కారులో ఎక్కించుకున్నారు. కొంతదూరం వెళ్లాక పెద్దిరెడ్డి రామిరెడ్డి దోర్నాలకు చెందిన స్నేహితుడు తంగిరాల శ్రీరామిరెడ్డికి ఫోన్ చేశారు. వివాదంలో ఉన్న పొలం అమ్మడం కరెక్ట్ కాదని ఆయన చెబుతుండగా ఫోన్ లాగేసుకుని స్విచాఫ్ చేశారు. అనుమానం వచ్చిన తంగారాల శ్రీరామిరెడ్డి 112కు ఫోన్ చేసి విషయం చెప్పడంతో పోలీసులు వెంటనే రంగంలోకి దిగారు. మార్కాపురం డీఎస్పీ వీరరాఘవరెడ్డి, కంభం సీఐ రాజేష్‌కుమార్ ఆదేశాల మేరకు బేస్తవారిపేట ఎస్సై మాధవరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించి సీసీ ఫుటేజీ సేకరించారు. ఏపీ 39డీజే2999 కారులో వృద్ధుడిని తీసుకెళ్తున్నట్లు గుర్తించారు. బేస్తవారిపేట, అర్ధవీడు, కంభం ఎస్సైలు మూడు బృందాలుగా ఏర్పడి పందిళ్లపల్లి టోల్ ప్లాజా, దిగువమెట్ట చెక్‌పోస్ట్ వద్ద సీసీ ఫుటేజీ పరిశీలించారు. ఫోన్ లొకేషన్ సాయంతో తెలంగాణ రాష్ట్రంలోని ఇత్తికల పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. పూసలపాడు గ్రామానికి బాడుగకు వెళ్లి ఓ వ్యక్తిని ఎక్కించుకుని నంద్యాలలోని సంజీవనగర్‌లో గురురాఘవేంద్ర బ్యాంక్ కోచింగ్ సెంటర్ వద్ద వదిలిపెట్టినట్లు పోలీసులకు కారు డ్రైవర్ వివరించాడు. అక్కడ ఓ గదిలో బంధించబడి ఉన్న పెద్దిరెడ్డి రామిరెడ్డిని నంద్యాల పోలీసుల సహాయంతో గుర్తించారు. అప్పటికే నిందితులు రామిరెడ్డిని తీవ్రంగా కొట్టి గాయపరిచారు. బ్యాంక్ అకౌంట్‌లోని రూ.25 లక్షల నగదు, పూసలపాడు, దోర్నాలలో ఉన్న విలువైన పొలం తమకు రాసివ్వాలని బలవంతం చేశారని రామిరెడ్డి పోలీసులకు తెలిపారు. అపస్మారక స్థితిలోకి వెళ్లే పరిస్థితిలో ఉన్న ఆయనను పోలీసులు ఆస్పత్రిలో చేర్చి చికిత్స చేయించారు. నంద్యాలకు చెందిన పసువుల రాము, బోయ నాగార్జున, బత్రాజు కేదార్‌నాథ్‌ను నిందితులుగా గుర్తించారు. కిడ్నాప్‌కు ఉపయోగించిన కారు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. సమయానికి రామిరెడ్డిని కనిపెట్టి ఉండకపోతే హత్య చేసి ఉండేవారని ఎస్పీ చెప్పారు. తంగిరాల శ్రీరామిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. డీఎస్పీ, సీఐ, ఎస్సై, సిబ్బందికి ఎస్పీ ప్రశంస పత్రాలు అందజేసి అభినందించారు. సమావేశంలో ట్రైనీ ఎస్పీ అంకితా సురానా, ఎస్పీ డీఎస్పీ మరియదాసు, దర్శి డీఎస్పీ అశోక్‌వర్ధన్‌రెడ్డి, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

సూర్యప్రభ వాహనంపై నృసింహస్వామి

- వైభవంగా సాగుతున్న బ్రహ్మోత్సవాలు



సూర్యప్రభ వాహనంపై ఊరేగుతున్న నరసింహస్వామి

సింగరాయకొండ: పురాణ ప్రసిద్ధి చెందిన పాతసింగరాయకొండలోని వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం స్వామివారు సూర్యప్రభ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా గ్రామోత్సవం నిర్వహించారు. స్వామివారు రాత్రికి హంస వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. శుక్రవారం స్వామివారు శేష వాహనంపై దర్శనమిస్తారని, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా వసతులు ఏర్పాటు చేసినట్లు ఈఓ పి.కృష్ణవేణి తెలిపారు.

పసివాడి తల్లి ఆచూకీ లభ్యం!



చికిత్స పొందుతున్న శిశువు

గిద్దలూరు రూరల్: అప్పుడే పుట్టిన పసికందును గోనె సంచిలో చుట్టి గిద్దలూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద వదిలేసి వెళ్లిన వ్యక్తులను పోలీసులు గుర్తించారు. రైల్వే స్టేషన్ రోడ్డులోని ఓ ఇంటికి అమర్చిన సీసీ కెమెరా ఫుటేజీని పోలీసులు పరిశీలించగా పసివాడిని పడేస్తున్న ఓ యువతి కనిపించింది. పెళ్లికాకుండానే గర్భందాల్చి ఆ యువతి ఆమె తల్లితో కలిసి పసిబిడ్డను విదిలేసిందని పోలీసుల విచారణలో వెల్లడైంది. యువతిది రాచర్ల మండలంగా గుర్తించారు. వైద్యశాలలో చికిత్స పొందుతున్న శిశువును ఒంగోలు సీడబ్ల్యూసీకి తరలించారు.

జగనన్నది జవాబుదారీ పాలన

- రైతు భరోసా పథకంతో అన్నదాతలకు అండ
- రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి ఆదిమూలపు సురేష్



లబ్ధిదారుడికి బుక్‌లెట్ అందిస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

యర్రగొండపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు జవాబుదారీ పాలన అందిస్తున్నారని, దేశంలో ఎక్కడాలేని విధంగా సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి పేదలను ఆదుకుంటున్నారని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. గురువారం పెద్దారవీడు మండలంలోని ఎస్.కొత్తపల్లి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత గతంలో ఎన్నడూ లేని విధంగా క్యాలెండర్ విడుదల చేసి కుల, మత, వర్గ, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారన్నారు. గత నాలుగేళ్ల కాలంలో సంక్షేమ పథకాల ద్వారా రూ.7 లక్షలకు పైబడి లబ్ధిపొందిన పేదలు ఉన్నారన్నారు. గడప గడపలో ప్రజలు తమ అవసరాలు చెబుతుంటే ‘జనం నిలదీస్తున్నారని’ ఎల్లో మీడియా దుష్ప్రచారం చేస్తోందని దుయ్యబట్టారు. రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిన చంద్రబాబునాయుడికి ఏదో ఒక విధంగా అధికారం కట్టబెట్టాలన్న ఆలోచనతో ఆ మీడియా శాయశక్తులా ప్రయత్నిస్తోందన్నారు. ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు సక్రమంగా అందివ్వాలన్న ఉద్దేశంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ల వ్యవస్థను ప్రవేశపెడితే వారిని పార్టీ వ్యవహారాలకు ఉపయోగించుకుంటున్నారని పచ్చనేతలు దుర్మార్గపు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.

వ్యవసాయానికి అండ రైతు భరోసా

వైఎస్సార్ రైతు భరోసా పథకం అన్నదాతలకు అండగా నిలుస్తోందని మంత్రి పేర్కొన్నారు. సీఎం వైఎస్ జగన్ క్రమం తప్పకుండా రైతుల అకౌంట్లలో ఏటా రూ.13,500 నగదు జమ చేస్తున్నారన్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతులకు తక్షణమే పరిహారం అందించే విధంగా చర్యలు తీసుకున్నారన్నారు. గత టీడీపీ ప్రభుత్వ కాలంలో రైతులు అనేక ఇబ్బందులకు గురయ్యారని, అప్పుల బాధతో అనేక మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని, ఇటువంటి తరుణంలో రైతుకుటుంబాలకు అండగా ఉండాల్సిన చంద్రబాబు వ్యవసాయం దండగ అంటూ ప్రకటించిన దుర్మార్గుడని మంత్రి విమర్శించారు. 2019 ప్రారంభం నుంచే జగనన్న నేతృత్వంలో రాష్ట్రంలోని రైతులు వ్యవసాయాన్ని పండుగ చేసుకుంటున్నారని ప్రజల హర్షధ్వానాల మధ్య పేర్కొన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే తిరిగి జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి రమేష్, డీఎల్‌డీవో బి.వి.ఎస్.సాయికుమార్, తహసీల్దార్ వేణుగోపాలరావు, ఎంపీడీఓ నాసర్‌రెడ్డి, ఎంఈఓ శ్రీనివాస్, ఏఓ బుజ్జిబాయి, ఏఈలు రమేష్, శ్రావ్య, రవీంద్రారెడ్డి, ఏఎంసీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ బెజవాడ పెద్ద గురవయ్య, జడ్పీటీసీ యేరువ చలమారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు పాలిరెడ్డి కృష్ణారెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ వై.వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్ వెన్నా కృష్ణారెడ్డి సంజీవరాణి, ఒద్దుల లక్ష్మీరెడ్డి, సొంటి నాగార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తలుపులు బద్దలుకొట్టి.. నగలు, నగదు లూటీ

- మూలగుంటపాడులో పట్టపగలే భారీ చోరీ
- 20 సవర్ల బంగారం, 10 కేజీ వెండి అపహరించిన దుండగులు



దొంగల దాడిలో ధ్వంసమైన తలుపులు



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ రంగనాథ్

సింగరాయకొండ: ఇంటి వెనుక వైపు తలుపులు బద్దలుకొట్టి లోపలికి ప్రవేశించిన దొంగలు.. బీరువాలో దాచి ఉంచిన 20 సవర్ల బంగారం ఆభరణాలు, 10 కేజీ వెండి, రూ.15 వేల నగదును అపహరించారు. ఈ సంఘటన సింగరాయకొండ మండలం మూలగుంటపాడు పంచాయతీలోని విద్యానగర్‌లో గురువారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. బాధితులు, పోలీసుల కథనం మేరకు.. విద్యానగర్‌లో రిటైర్డ్ పంచాయతీ కార్యదర్శి చెవుల రాజచంద్రశేఖర్, తన భార్య లక్ష్మితో కలిసి నివాసం ఉంటున్నారు. తన మామకు యాక్సిడెంట్ అయిందన్న సమాచారం తెలియడంతో ఉదయం ఏడు గంటలకు భార్యతో కలిసి నెల్లూరు వెళ్లారు. సాయంత్రం 5 గంటలకు ఇంటికి చేరుకున్న ఆయన వెనుకవైపు తలుపు విరిగి ఉండటం, బెడ్‌రూమ్, బీరువాలో వస్తువులు చిందరవందరగా ఉండటంతో చోరీ జరిగిందని గ్రహించారు. బీరువాలో 20 సవర్ల బంగారు గాజులు, ఉంగరాలు, చైన్లు, 10 కేజీల వెండి వస్తువులు, రూ.15 వేల నగదు చోరీ అయ్యాయని పోలీసులకు సమాచారం అందించారు. బెడ్‌రూమ్‌లో మరో బీరువాను తెరిచేందుకు దొంగలు విఫలయత్నం చేశారు. ఆ బీరువా తలుపులు తెరుచుకుని ఉంటే మరో 20 కేజీల వెండిని దొంగలు కాజేసేవారని రాజచంద్రశేఖర్ వివరించారు.

ముందుగా పక్కింట్లో రూ.100 చోరీ

దొంగలు తొలుత రాజచంద్రశేఖర్ పక్కింట్లోకి ప్రవేశించారు. ఇల్లు మొత్తం గాలించగా వారికి దుప్పటి కింద రూ.100 మాత్రమే దొరికింది. ఆ తర్వాత చంద్రశేఖర్ ఇంట్లోకి దొడ్డిదారిన ప్రవేశించారు. దిండు కింద ఉన్న తాళాలు తీసుకుని బీరువాలో ఉన్న సొమ్ము కాజేశారు. సుమారు 1.30 గంటల సమయంలో ఆ ప్రాంతంలో సిమెంటు కలర్ వ్యాను అరగంటకు పైగా ఆగిఉందని స్థానికులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా ఈ ఏడాది తన ఇంట్లో నాలుగు చిన్న దొంగతనాలు జరిగాయని, ఇప్పుడు ఏకంగా భారీ మొత్తంలో సొమ్ము కాజేశారని చంద్రశేఖర్ ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో దొంగతనాలు జరిగినప్పుడు చిన్నవే కదా అని పోలీసులకు ఫిర్యాదు చేయలేదని తెలిపారు. సంఘటనా స్థలాన్ని సీఐ దాచేపల్లి రంగనాథ్ పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహమ్మద్ ఫిరోజ్ ఫాతిమా తెలిపారు.

4న పర్యావరణంపై విద్యార్థులకు పోటీలు

ఒంగోలు: ఏపీ రాష్ట్ర శాస్త్ర సాంకేతిక సంస్థ, ప్రకాశం జిల్లా విద్యాశాఖ, జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 4న విద్యార్థులకు పోటీలు నిర్వహించనున్నట్లు డీఈఓ పి.రమేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో విద్యార్థుల పాత్రపై వ్యాసరచన, ఏదైనా పర్యావరణ అంశంపై డ్రాయింగ్, పర్యావరణ పరిరక్షణ కోసం ఒక్క అడుగు అంశంపై వక్తృత్వ పోటీలను ఉదయం 10 గంటలకు జిల్లా గ్రంథాలయ భవనంలో నిర్వహిస్తామని వివరించారు. విజేతలకు 5వ తేదీన బహుమతులు అందజేస్తామని తెలిపారు. వివరాలకు 96669 55504, 98480 40633ను సంప్రదించాలని డీఈఓ సూచించారు.

బేల్దారి ఉసురుతీసిన కట్టర్



మృతి చెందిన కోవూరి కిరణ్



ప్రమాదానికి కారణమైన కట్టర్



కిరణ్(ఫైల్)

పామూరు: ఇంటి నిర్మాణ పనులు చేస్తున్న బేల్దారీ కూలీకి ప్రమాదవశాత్తు కట్టర్ తగలడంతో తీవ్ర రక్తస్రావమై మృత్యువాతపడ్డాడు. ఈ సంఘటన గురువారం పామూరు మండంలోని తూర్పు కట్టకిందపల్లె గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలు.. తూర్పు కట్టకిందపల్లె గ్రామానికి చెందిన కోవూరి కిరణ్ బేల్దారి కూలీగా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. స్వగ్రామంలో నీటుకట్టు సత్యం అనే వ్యక్తికి చెందిన నూతన గృహంలో ధర్వాజా అమర్చేందుకు కట్టర్‌తో గోడను తొలిచేందుకు యత్నించాడు. ఈ క్రమంలో పొరపాటున కిరణ్ చేతిలోని కట్టర్ అదుపుతప్పి ఎడమకాలి మోకాలి వెనుకభాగంలో తగిలింది. లోతైన గాయం కావడంతో తీవ్రంగా రక్తస్రావమైంది. స్థానికులు స్పందించి క్షతగాత్రుడిని హుటాహుటిన ఆటోలో పామూరులోని వైద్యశాలకు తరలించారు. అప్పటికే కిరణ్(36) మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతదేహాన్ని కనిగిరి ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడి తండ్రి కోవూరి కోటయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కె.సురేష్‌యాదవ్ తెలిపారు.

దిక్కుతోచని స్థితిలో కుటుంబం

కిరణ్‌ది రెక్కాడితే గానీ డొక్కాడని కుటుంబం. అతని మృతి ఆ కుటుంబాన్ని మరింత కష్టాల్లోకి నెట్టింది. ఎప్పటిలాగే ఉదయాన్నే పనికి వెళ్లిన కిరణ్ మరికొద్దిసేపట్లో అల్పాహారం తినేందుకు ఇంటికి వస్తాడని ఎదురుచూస్తున్న భార్య సౌజన్యకు భర్త మృతి చెందాడని తెలియడంతో హతాశురాలైంది. కూలి డబ్బు వచ్చిన వెంటనే పిల్లలిద్దరికీ పుస్తకాలు, బట్టలు కొనిస్తానని చెప్పావు కదయ్యా.. ఇలా వదిలేసిపోయావా.. ఇంక మాకు దిక్కెవరు అంటూ కిరణ్ భార్య విలపిస్తున్న తీరు అందరినీ కంటతడి పెట్టించింది.

నేడు టీచర్ల సీనియార్టీ జాబితా విడుదల

ఒంగోలు: ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియకు సంబంధించి తుది సీనియార్టీ జాబితా శుక్ర, శనివారాల్లో విడుదల కానుంది. ఈ మేరకు విద్యాశాఖ అధికారులు ముమ్మరంగా కసరత్తు చేస్తున్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో బదిలీల ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు, బదిలీల ప్రక్రియను చేపట్టేవారి విధులకు ఎలాంటి అంతరాయం కలగకుండా ఉండేందుకు ప్రత్యేక స్వేచ్ఛ ఇచ్చారు. రాష్ట్ర కమిషనర్ కార్యాలయానికి పంపాల్సిన సమాచారం ఏమాత్రం జాప్యం కాకుండా డీఈఓ పి.రమేష్ ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు.

ఆన్‌లైన్ దరఖాస్తులు 6,066

ఆన్‌లైన్‌లో బదిలీలకు దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయుల సంఖ్య 6,066కు చేరింది. వీరిలో తప్పనిసరిగా బదిలీ అయ్యేవారితోపాటు ఐచ్ఛికంగా బదిలీని కోరుకున్నవారు ఉన్నారు. తప్పనిసరిగా బదిలీలను కోరుకునేవారిలో ఐదేళ్లు ఒకే పాఠశాలలో పనిచేసిన ప్రధానోపాధ్యాయులు, 8 సంవత్సరాలు ఒకే పాఠశాలలో పనిచేసిన ఉపాధ్యాయులు ఉన్నారు. సెకండరీ గ్రేడ్ టీచర్లు, సెకండ్ గ్రేడ్ హెడ్మాస్టర్లు 3347 మంది బదిలీలకు దరఖాస్తు చేసుకున్నారు. వీరు కాకుండా తెలుగు టీచర్లు 613, సంస్కృతం 01, ఉర్దూ 08, హిందీ 291, ఆంగ్లం 351, గణితం 444, ఫిజికల్ సైన్స్ 318, బయోలాజికల్ సైన్స్ 250, సోషల్ స్టడీస్ టీచర్లు 281 మంది దరఖాస్తులు సమర్పించారు.

అభ్యంతరాల పరిశీలన పూర్తి

ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి ఏవైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ మే 31, జూన్ 1వ తేదీల్లో అవకాశం కల్పించారు. ఈ మేరకు గురువారం నాటికి అన్ని ఉపాధ్యాయ/ ప్రధానోపాధ్యాయులకు సంబంధించి అభ్యంతరాలు 368 జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి చేరాయి. వాటిలో ఎక్కువగా పాయింట్లపైనే అభ్యంతరాలు ఉన్నాయని అధికారులు తెలియజేశారు. గురువారం రాత్రి అభ్యంతరాల పరిశీలన కార్యక్రమం పూర్తయింది. హెడ్మాస్టర్లు, స్కూల్ అసిస్టెంట్ల సీనియార్టీ జాబితా ఈనెల 2న, సెకండరీ గ్రేడ్ టీచర్ల సీనియార్టీ జాబితా ఈ నెల 3న విడుదల చేయనున్నారు.

రెండు రోజులపాటు వర్క్‌షాప్

విద్యార్థుల ఆసక్తిని, ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని బదిలీల ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు సర్వీసు మ్యాటర్లకు సంబంధించి సెక్షన్ సూపరింటెండెంట్, ఏఎస్ఓ, ఏపీవోలతో రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ కార్యాలయంలో అవగాహన కల్పించాలని నిర్ణయించారు. వివిధ ప్రాంతాల్లో ఉపాధ్యాయుల ఆవశ్యకత, విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఎలా వ్యవహరించాలన్న విషయమై చర్చించేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేశారు. గైడ్‌లైన్స్ ఆధారంగా వెబ్ ఆప్షన్లకు సంబంధించి 4వ తేదీ ఖాళీల జాబితాను వెబ్‌సైట్‌లో ఉంచుతారు. ఈ నెల 5 నుంచి ఆప్షన్లకు ఉపాధ్యాయులు సిద్ధం కానున్నారు.